
మాట్లాడుతున్న డీఆర్డీవో సాంబశివరావు


ఎన్టీఆర్ చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీపై ప్రజలకు విశ్వాసం

- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): బీజేపీని ప్రజలు విశ్వసిస్తున్నారని, అందుకు నిదర్శనం ఢిల్లీలో బీజేపీ ఫలితాలేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఢిల్లీలో బీజేపీ గెలుపుతో సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రజల మంచి కోరుతుందని, అవినీతి పార్టీలు జాడ లేకుండా పోతున్నాయన్నారు. 27 ఏళ్ల సుదీర్ఘ కాలం తరువాత ఢిల్లీ పీఠంపై బీజేపీ జెండా ఎగురవేసిందని, రాష్ట్రంలోనూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని గల్లీ నుంచి ఢిల్లీ దాకా బీజేపీ విజయఢంకా మోగించాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్, విజయభాస్కర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ నరోత్తంరెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ యాస్కి శిరీష, బుస్సా శ్రీకాంత్, నాయకులు రాజునాయక్, చరణ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శరణరెడ్డి, రాజేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

మహిళా సంఘాల బలోపేతానికి
'సీఆర్పీ వ్యూహం'

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల బలోపేతానికి జిల్లాలో సీఆర్పీ వ్యూహం అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సీఆర్పీ మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీక్ జైన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహా సమాఖ్య, స్తంభాద్రి మహా సమాఖ్య, ఓరుగల్లు మహా సమాఖ్యలకు, సీఆర్పీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున 15 బృందాలను ఏర్పాటు చేసి, 45 మంది మహిళలతో జిల్లాలోని ధారూరు, దోమ, వికారాబాద్, మర్పల్లి, మోమిన్‌పేట మండలాల్లో మహిళా సంఘాల ఏర్పాటు, ప్రోత్సాహం, బలోపేతానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ బృందాలు ఎనిమిది రోజుల పాటు కేటాయించిన గ్రామాలకు వెళ్లి మహిళలకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. సీఆర్పీలకు లద్దాఖ్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, త్రిపుర, గోవా తదితర రాష్ట్రాల్లో మహిళా సంఘాల ఏర్పాటుపై శిక్షణ అందించినట్లు చెప్పారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో కూడా మహిళలకు సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో మహిళలకు అప్పులు, పొదుపుపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్, అదనపు డీఆర్డీఏ సరోజ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

- రూ. 11.75లక్షల విలువైన 60 ఫోన్లు, సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పోచారం ఐటీ కారిడార్ పోలీసులు

8

పిల్లలకు పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులి పురుగులను నివారించేందుకు ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసు ఉన్నవారికి, కిశోర బాలలకు ఈ మాత్రలను పంపిణీ చేయనున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మాత్రలను వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ఏఎన్ఎం, ఆశాలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కూడా ఇచ్చారు.





అపరిశుభ్రతే కారణం..

వాస్తవానికి మనిషి పేగుల నుంచి పోషకాలను గ్రహించి వృద్ధి చెందే పరాన్న జీవులే నులిపురుగులు. ముఖ్యంగా పిల్లల్లో ఏలికపాములు, నులి, కొంకి పురుగులుగా ఉంటాయి. ఆరుబయట చెప్పులు లేకుండా ఆడుకోవడం ద్వారా, చేతులు శుభ్రం చేసుకోకుండా భుజించడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, అపరిశుభ్రమైన పరిసరాల వల్ల ఇవి వ్యాప్తి చెందుతాయి. వీటిని నివారించేందుకు షూ ధరించడం, భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయొద్దు. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి తినాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి. ఆరుబయట మల విసర్జనకు వెళ్లరాదు. ఆహార పదార్థాలపై మూతలు పెట్టాలి. వీధుల్లో విక్రయించే ఆహారాన్ని భుజించరాదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

నులిమేద్దాం!

నులి పురుగులతో ఆరోగ్యానికి చేటు

1-19 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ
8,70,650 మందికి మాత్రలు అందజేయడమే లక్ష్యం
ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య ఆరోగ్య శాఖ
ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినం



మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, కడుపు నొప్పి , రక్తహీనతకు నులిపురుగులు కారణమవుతుంటాయి. పేగుల్లో తిష్టవేసి ఆహారంలోని పోషకాలను గ్రహిస్తూ నెమ్మదిగా వృద్ధి చెందుతాయి. వీటిలో నులిపురుగులు, ఏలిక పాములు, నట్టలు అనేక రకాలుగా ఉంటాయి. ఇవి పేగుల్లో వృద్ధి చెంది మెల్లిగా రక్తంలోకి చేరి రక్తహీనతకు కారణం అవుతాయి. ఈ నులి పురుగుల నివారణకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపడుతోంది. ఈనెల 10న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 1-19 ఏళ్లలోపు ఉన్న 8,60,696 మందికి ఈ మాత్రలు వేయించాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లాలోని 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో 406 మంది ఏఎన్ఎం, 1,368 మంది ఆశాలకు,

మిగతా 7వ పేజీలో...

త్వరలో మాత్రలు పంపిణీ చేస్తాం



చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని అరికట్టడంలో భాగంగా నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏటా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, కాలేజీల్లో చిన్నారులు, కిశోర బాలలకు అల్బెండజోల్ మాత్రలను వేసేందుకు వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించాం. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 8,70,650 మంది చిన్నారులను గుర్తించాం. ఈ నెల 10న అల్బెండజోల్ మాత్రలను పంపిణీకి సిద్ధం అయినప్పటికీ అనివార్య కారణాల వల్ల కార్యక్రమం రద్దయింది. త్వరలోనే మాత్రలను పంపిణీ చేస్తాం.

- రఘునాథస్వామి, మేడ్చల్ జిల్లా వైద్యాధికారి

ప్రభుత్వ పథకాలను సద్వినియోగించుకోవాలి

- డీఆర్డీవో సాంబశివరావు

శామీర్‌పేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీఆర్డీవో సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఈడీఎంఎం ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువత కోసం ఉపాధి కల్పించేందుకై జాబ్ మేళా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు విచ్చేసి పలు కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 142 మంది యువత హాజరయ్యారు. అపోలో ఫార్మసీ, నిర్మాణ రంగంలో శిక్షణకు, జియో టెక్నాలజీ, టాటా స్పేస్, ట్రెడ్స్ టెక్నాలజీ, ఈసీఈ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగాలు చేసేందుకు ఎంపికైనట్లు ఎంపీడీవో మమతా బాయి వెల్లడించారు.


పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఓంకారేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

- పాల్గొన్న భక్తజనం

కులకచర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో నూతనంగా నిర్మించిన ఓంకారేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం గణపతి గౌరీపూజ, గోపూజ, అఖండ దీపారాధన, విగ్రహాలకు అభిషేకం, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

కవయిత్రి మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు జయంతి రావు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 8, (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఏడాది మార్చి 13వ తేదీన మొల్ల జయంతిని ప్రభుత్వం అధికారింగా నిర్వహించాలని రాష్ట్ర కుమ్మర సంఘం అధ్యక్షుడు నడికూడ జయంతి రావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అంతారం చౌరస్తాలో కవయిత్రి ఆతుకూరి కుమ్మర మొల్ల విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతి రావు ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొల్లమాంబ(మొల్ల) విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన గ్రామ పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం మార్చి 13న మొల్ల జయంతిని అధికారింగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులంతా అభివృద్ధికి కలిసి కట్టుగా ముందుకుసాగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి అనంతయ్య, మాజీ సర్పంచ్ ఎత్తరి రాములు, తాండూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ వడ్డె


అంతారంలో మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కొంరెట్టిపల్లి శాంతు, బీసీ కమిషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, మల్కాజిగిరి దయానంద, ఆమంచి రాజలింగం, నిమ్మలూరి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు మారుతి, నారాయణ, సభ్యులు శంకర్, పండరి, లక్ష్మణ్, బాలప్ప, విఠల్, విశ్వనాథ్, వెంకట్, కేవీఎం రాజు, రవి, సాయిలు, దసత్తప్ప, నగేష్, జనార్ధన్, వెంకటయ్య, పంచాక్షరి శివ, శ్రీశైలం, బందెప్ప తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక జైళ్లు అవసరం

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద
- 'జైళ్లలో మహిళలకు వర్తించే చట్టాలు' అంశంపై సదస్సు


చర్చిస్తున్న కమిషన్ల చైర్‌పర్సన్లు, న్యాయాధికారులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): థర్డ్ జెండర్లు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక జైళ్లను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. శనివారం శామీర్‌పేటలోని నల్సార్ లా వర్సిటీలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో 'జైళ్లలో మహిళలకు వర్తించే చట్టాలు' అంశంపై దక్షిణ భారత ప్రాంత ఒకరోజు సదస్సు నిర్వహించారు. జాతీయ మహిళా కమిషన్, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని జైళ్లలో ఉంటున్న మహిళలకు వర్తించే చట్టాలపై సమీక్ష నిర్వహించారు. శారద మాట్లాడుతూ జైళ్లలోని మహిళలు, థర్డ్‌జెండర్ ఖైదీల అనేక సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ హైకోర్టు మాజీ జడ్జి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. మహిళలు, ట్రాన్స్‌జెండర్ ఖైదీల అవసరాలపై అవగాహన పెంచేందుకు మరిన్ని సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తమిళనాడు జైళ్ల శిక్షణ అకాడమీ మాజీ డైరెక్టర్ అహ్మద్, నల్సార్ వైస్‌చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు, కేరళ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్, పలు రాష్ట్రాల మహిళ, శిశు కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం మినహా.. మిగతా హామీల అమలేదీ?
వందశాతం రుణమాఫీ బోగస్..
ప్రజలు కాంగ్రెస్‌పై ఆగ్రహంగా ఉన్నారు..
రైతులు తిట్టరాని తిట్లు తిడుతున్నారు..
తెలంగాణలో మరో 15 ఏళ్లపాటు ఓట్లడిగే పరిస్థితి కాంగ్రెస్‌కు లేదు
వికారాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో కేటీఆర్

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం

వికారాబాద్ జడ్పీపై గులాబీ జెండా ఎగరేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వికారాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకొని వికారాబాద్ జిల్లా పరిషత్‌పై గులాబీ జెండా ఎగురవేసేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన వికారాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. రుణమాఫీ కాలేదని ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీపైన చాలా కోపంగా ఉన్నారన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న రేవంత్ రెడ్డి.. ఆరు గ్యారెంటీల్లో ఒక్క ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం మినహా మిగతా హామీలు అమలు కాకపోవడంతో ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధుకు రాంరాం అవుతుందని కేసీఆర్ చెప్పినట్లే అయ్యిందన్నారు. వందశాతం రుణమాఫీ పచ్చి బోగస్ అని, 25 శాతం కూడా కాలేదని చెప్పారు. రైతులు తిట్టరాని తిట్లు తిడుతున్నారని, తిట్టే తిట్టు చూస్తుంటే ఇలాంటి తిట్లు కూడా ఉంటాయనేది కూడా తనకు తెలియదని, ఓ తాత నాలుగున్నర నిమిషాల్లో నాలుగైదు వందల తిట్లు తిట్టారన్నారు. రోషం ఉన్నోడైతే బావిలో నీళ్లపోసి దూకి చచ్చిపోతుండేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ప్రజలు ఏడాదిలోపే గుర్తించారని, వికారాబాద్‌లో ఏ ఊరికైనా వెళ్లి ఎవరిని అడిగినా తిట్టిపోస్తున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి పుణ్యాన తెలంగాణలో మరో 15 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు ఓట్లడిగే పరిస్థితి లేదని, గ్రామాల్లోకి ఓట్లు అడగడానికి నాయకులు వస్తే రైతులు దంచి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో చాలా కోసం ఉందని, బీజేపీ మీద ప్రేమ అసలే లేదని, ఉన్న ప్రేమంతా కేసీఆర్‌పైనే ఉందని, ఆయనే తిరిగి రావాలని ఉందని చెప్పారు. స్థానికంగా సమస్యలు ఉంటే సర్దుబాటు చేసుకుందామని, సమష్టిగా పనిచేసి పంచాయతీలు, మండల పరిషత్తులు, జడ్పీటీసీ స్థానాలను గెలుచుకొని వికారాబాద్ జడ్పీపై గులాబీ జెండా ఎగురవేద్దామని సూచించారు. ప్రస్తుతం ప్రజల్లో బీఆర్ఎస్‌కు అనుకూలమైన వాతావరణం ఉందని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న కాంక్ష ప్రజల్లో వ్యక్తమవుతోందని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఎన్నిక ఏదైనా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా

మిగతా 8వ పేజీలో...

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జ్యోతి

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సామాజికాభివృద్ధికి మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఇందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి అన్నారు. మొయినాబాద్ పరిధి అజీజ్‌నగర్ చౌరస్తాలో పార్టీ మహిళా విభాగ జిల్లా స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. లేడీ వింగ్ కమిటీల ఏర్పాటుపై చర్చించారు. జ్యోతి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల నియోజకవర్గ మహిళా విభాగ ఇన్‌చార్జి రమ్యశ్రీ, నాయకురాళ్లు సమత, చంద్రిక, ముంతాజ్, కల్పన పాల్గొన్నారు.

జేబీఐఈటీ ప్రొఫెసర్లకు డాక్టరేట్



శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అమ్డాపూర్ చౌరస్తాలో గల భాస్కర ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు డాక్టరేట్ సాధించారు. డేటా సైన్స్ విభాగ హెచ్‌వోడీ తంగిరాల గాయత్రి, శ్రీనివాస్‌లకు డాక్టరేట్ వచ్చింది. 'ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో '3.1 టు హై ఫ్రీక్వెన్సీ బ్యాండ్' అంశంపై వారు పరిశోధన చేశారు. శనివారం డాక్టరేట్ స్వీకరించారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు షురూ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్ , ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అర్చకులు వెంకటేశ్, శ్రీధర్, నర్సింహ్మ మూర్తి, శ్రీమన్నారాయణ, వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో విశేష పూజలు, అంకురార్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డిలు పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

ధారూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవ రెడ్డి తెలిపారు. మండలంలోని నాగారంలో రూ. 10 లక్షల ఎంపీ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శివరాజ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వి.నందు, మండలాధ్యక్షుడు రాజునాయక్ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



మహాలింగపురంలో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. మహాలింగపురం, జన్వాడ గ్రామాలలో నాబార్డు నిధులతో ఏర్పాటు చేసిన గోదాములను, శంకర్‌పల్లి ప్రాథమిక సమకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన లాకర్ గదిని డీసీసీబీ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య, డీసీఎంఎస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డిలతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటుగా మరిన్ని సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు. రైతులకు రుణ మాఫీ చేశామని, త్వరలో రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి, మోకిల సొసైటీ చైర్మన్‌లు శశిధర్‌రెడ్డి, గోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి. శంకర్‌పల్లి సొసైటీ వైస్ చైర్మన్ సంజీవరెడ్డి, డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, పాండు, మోహన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అనంతయ్య, శారద, పద్మమ్మ ఉన్నారు.

100వ రోజూ దీక్షలు

తలకొండపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లి మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేపట్టిన దీక్షలు శనివారం 100వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా జేఏసీ నాయకులతో కలిసి గట్టిప్పలపల్లి సమీప గ్రామాలు, తండాల ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ లు శరత్‌చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్ తెలిపారు.

వెంకటేష్ సేవలు మరువలేనివి

శంషాబాద్ సింగిల్ విండో చైర్మన్ మల్లారెడ్డి



వెంకటేష్‌ను సన్మానిస్తున్న చైర్మన్ ముద్దంమల్లారెడ్డి, సిబ్బంది

శంషాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : వెంకటేష్ సేవలు మరువలేనివని సింగిల్‌విండో చైర్మన్ ముద్దం మల్లారెడ్డి అన్నారు. 40 సంవత్సరాలుగా శంషాబాద్ సింగిల్ విండో సేల్స్‌మెన్‌గా పనిచేసి శనివారం పదవీ విరమణ పొందారు. అదే రోజూ సాయంత్రం అభినందన సమావేశంలో ఏర్పాటు చేసి ఆయనను చైర్మన్ ముద్దం మల్లారెడ్డితో పాటు సిబ్బంది శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌యాదవ్, కరుణాకర్‌రెడ్డి, గుర్రంపల్లిశ్రీనివాస్ కొత్తపోచయ్య పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని సహకార సంఘంలో శనివారం రూ.20లక్షల అంచనా వ్యయంతో నిర్మించి దుకాణసముదాయం అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, వైస్‌చైర్మన్ బద్దం అనంతరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, స్వామి, బీక్షపతి, అంజిరెడ్డి, రామోజీ, కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

లైంగికదాడికి యత్నం కేసులో నిందితుడికి రిమాండ్

శంషాబాద్ రూరల్/మంచాల ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడికి యత్నించిన కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. మంచాల సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసెస్ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను ఈనెల 4న విహారయాత్రకు తీసుకెళ్లింది. అయితే, వికారాబాద్ జిల్లా మంచాల మండల పరిధిలోని సిరి నేచర్ వ్యాలీ రిసార్ట్‌లో 1వ తరగతి చదువుతున్న ఆరేళ్ల చిన్నారిపై స్కూల్ బస్ డ్రైవర్ జోసఫ్‌రెడ్డి లైంగికదాడికి యత్నించాడు. ఈమేరకు నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా శిక్షపడేలా చూడాలని పలువురు దళిత సంఘం నేతలు ఆర్జీఐఏ సీఐ బాల్‌రాజ్‌ను కలిసి విన్నవించారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గుంతలో పడి 70 గొర్రెల మృతి

మాడ్గుల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మేతకు వెళ్తుండగా గుంతలో పడి 70 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన మాడ్గుల మండలం నల్లచెర్వు సమీప అజాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి... వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలానికి చెందిన గొర్రెల కాపరి బండెల శ్రీరాములు తన జీవాలను మేపుకుంటూ నల్లచెర్వు ప్రాంతానికి వచ్చాడు. ఓ పత్తి చేనులోకి ఇవి వెళ్తుండగా రోడ్డు పోసేందుకు తీసిన భారీ కోపు గుంతలో పడి చనిపోయాయి. ప్రమాదంలో అన్ని జీవాలు మరణించడంతో శ్రీరాములు కన్నీరుమున్నీరయ్యారు.

పట్టా భూములు ఇవ్వలేం

- హకీంపేట్ రైతుల నివేదన
- సర్వేకు సహకరించని వైనం
- హద్దులు చూపని 96 మంది



హకీంపేట్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

దుద్యాల, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల, రోటిబండ, పులిచర్లకుంట తండాల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 1,177 ఎకరాల 35 గుంటల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. అందులో 532 ఎకరాల 81 గుంటల అసైన్డ్ భూములు, 643 ఎకరాల 34 గుంటల పట్టా భూములను సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఆయా గ్రామాల పరిధిలోని 532 ఎకరాల 81 గుంటలు అసైన్డ్ భూములను అధికారులు సర్వే చేసి రైతుల నుంచి సేకరించారు. శనివారం హకీంపేట్ శివారులో గల 246 సర్వేనెంబర్ మినహా 237 నుంచి 251 వరకు 114 మంది పట్టాదారులకు సంబంధించిన 146 ఎకరాల 34 గుంటల భూముల్లో సర్వే నిర్వహించారు. నాలుగు బృందాలుగా ఏర్పడిన రెవెన్యూ, పోలీసు అధికారులు రైతుల పొలాల దగ్గరికి వెళ్లారు. కాగా, హద్దులను చూపించేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. అధికారులు ఆయా సర్వే నెంబర్ల హద్దుల చుట్టూ తిరిగి సర్వే నిర్వహించారు. అంగీకారం తెలిపిన 18 మంది పట్టాదారులకు సంబంధించిన 13 ఎకరాల 18గుంటలకు సంబంధించి రైతులు తమ హద్దులను అధికారులకు చూపించారు. అనంతరం వారి నుంచి సంతకాలు సేకరించారు. మిగిలిన 95మంది హద్దులు చూపించలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 146 ఎకరాల 34 గుంటల భూ సర్వే ప్రశాంతంగా పూర్తిచేసినట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. అయితే, కొందరు రైతులు తమ భూములను తీసుకోరాదని, భూ సర్వే చేయరాదని అధికారులను వేడుకున్నారు. పట్టా భూములను ఇవ్వలేమని, తాతల తరాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని వాపోయారు. కాగా, అసైన్డ్ భూములకు సంబంధించి పరిహారం కింద ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల డీటీసీపీ లేఅవుట్ ప్లాటు, ఇందిరమ్మ ఇల్లు, ఇంటికో ఉద్యోగం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినా, పట్టా భూములకు సంబంధించిన పరిహారం మాత్రం ప్రకటించలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దుద్యాల ఎస్సై యాదగిరి ఆధ్వర్యంలో 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌బాబు, ఆర్‌ఐలు నవీన్, రవీందర్‌చారి, మహేశ్ పాల్గొన్నారు.

మమ్మల్ని చంపి తీసుకోండి



మాకు 7 ఎకరాల భూమి ఉంది. రెండెకరాల్లో మామిడి తోట ఉంది. ఇద్దరు కొడుకులు ఉన్నారు. న న్ను, మా పిల్లలను చంపి భూములు తీసుకోండి. భూమి తీసుకుంటే బతకడం కష్టంగా మారుతుంది. కాయకష్టం చేసుకుంటూ జీవిస్తున్నాం. అలాంటి భూమిని ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదు.

దొరమోని అనంతమ్మ, హకీంపేట్

భూమి తీసుకుంటే ఎలా బతకాలి



నాకు ముగ్గురు కుమారులు. కన్న కష్టం చేసి తీసుకున్న భూములు. నేడు మా భూమి మొత్తం పోతే ఎలా బతకాలి. చాలా తిప్పలు అయితది. మా భూముల జోలికొస్తే చావనైనా చస్తాం కానీ, భూములు మాత్రం ఇవ్వం. మీ కాళ్ల మొక్కుతాం మా భూముల జోలికి రావొద్దు.

మంగలి జయమ్మ, హకీంపేట్

మార్కెట్‌లో కంది, వేరుశనగ బీట్లు

ధారూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కంది, వేరుశనగ పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. ఎర్ర కందులు క్వింటాలుకు రూ.7,580 నుంచి రూ.7,350వరకు, వేరుశనగ క్వింటాలుకు రూ.6,300ల నుంచి రూ.5,500ల వరకు ధర పలికాయి. బీట్లలో కందులు 839.5 క్వింటాళ్లు, వేరుశనగ 464.7 క్వింటాళ్ల క్రయవ్రియాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

వారానికి రెండు రోజులపాటు...

పరిగి,ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్‌లో ఇక నుంచి వారానికి రెండు రోజులపాటు బీట్లు నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్‌కిషోర్ తెలిపారు. ఇప్పటి వరకు ప్రతీ శుక్రవారం మాత్రమే బీట్లు జరిగేవని తెలిపారు. ధాన్యం ఎక్కువగా వస్తున్న దృష్ట్యా ఇక నుంచి ప్రతీ శుక్ర, మంగళవారాలు బీట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విష్ణుమూర్తి అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం 'ది ఆర్ట్ ఆఫ్ కమ్యూనికేషన్'పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక, వృత్తి, కమ్యూనికేషన్‌లపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రణాళికలు సిద్ధం చేసుకొని వాటిని సాధించడానికి అహర్నిశలు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ విజయ్‌కుమార్, కో-ఆర్డినేటర్ సంధ్యారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'సీఆర్‌ఆర్' రూ.8.05 కోట్లు మంజూరు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా ఆమనగలుల, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు సీఆర్‌ఆర్ గ్రాంట్ కింద రూ.8.05కోట్లు మంజూరైనట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఎస్సీ కాంపొనెంట్ నిధులతో ఎస్సీ కాలనీల్లో 163 సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేస్తామని చెప్పారు. కడ్తాలలోని ఎస్సీ కాలనీలో రూ.35లక్షలతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు శనివారం స్థానిక నాయకులతో కలిసి భూమి పూజచేశారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కాలనీ యువకులు, మండల పరిషత్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఎంపీడీవో సుజాత ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి సీఆర్‌ఆర్ గ్రాంట్ రూ.23.25కోట్లు కేటాయించారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం మాటకు కట్టుబడి ఉందన్నారు. కడ్తాలలో 30పడకల ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మ, వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఏఈ పరమేశ్, పంచాయతీ కార్యదర్శి అల్లాజీ పాల్గొన్నారు.

రెండిళ్లలో భారీ చోరీ

- 57తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదు అపహరణ



సాయిపూర్‌లో విచారిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): దొంగలు రెండిళ్లలో పడి 57 తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదును ఎత్తుకెళ్లిన సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. సాయిపూర్‌నకు చెందిన పట్లోళ్ల వెంకటేష్-సరళ దంపతులు ఈ నెల 6న ఇంటికి తాళం వేసి ధారూర్ మండలం నాగసానిపల్లిలో జరిగిన ఓ పెళ్లికి వెళ్లారు. శనివారం ఇంటికొచ్చి చూస్తే తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లగా వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో దాచిన 40తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకపోయినట్టు గుర్తించారు. ఇదిలా ఉండగా.. ఈ చోరీ ఘటనపై శనివారం వార్త సేకరణకు వెళ్లిన తాండూరుకే చెందిన విలేకరి బస్వరాజ్‌గౌడ్ ఇంట్లోనూ దొంగలు చోరీ చేశారు. బస్వరాజ్‌గౌడ్ వార్తల కవరేజ్‌కి, అంగన్‌వాడీ టీచరైన అతడి భార్య విధులకు వెళ్లారు. ఇదే అదునుగా అతడి ఇంట్లో, అలాగే పక్కనున్న వారి బంధువుల ఇంట్లో 17 తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షలను దొంగలు ఎత్తుకు పోయారు. ఈ మేరకు రెండు కుటుంబాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై రమేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీంలతో ఆధారాలు సేకరించారు.

అటవీ ప్రాంతంలో అగ్నికీలలు



మంటలార్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

యాచారం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలం గున్‌గల్ రిజర్వ్ ఫారెస్టులో శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. అగ్నికీలలు అంటుకొని చెట్లు తగలబడుతున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఈ ప్రాంతానికి చేరుకున్నారు. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు విషయం తెలిపారు. హుటాహుటిన ఫైర్‌సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇప్పటికే పలు చెట్లు కాలిబూడిదయ్యాయి.

రైతుల కోసం అధికారుల ఎదురుచూపు

యాచారం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి ఆర్డీఓ అనంతరెడ్డి యాచారం తహసీల్దార్ కార్యా లయానికి చేరుకున్నారు. రైతులు వస్తారని చాలాసేపు ఎదురుచూశారు. ఆ మేరకు ముందస్తు బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా ఏసీపీ కేపీవీరాజు, ఇద్దరు సీఐలు, మరో ఇద్దరు ఎస్‌ఐలు ఇక్కడికి చేరుకున్నారు. కానీ రైతులు కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కొంతసేపు వేచి చూసి కలెక్టరేట్ కార్యాలయ ప్రతినిధికి సమాచారం ఇచ్చి తిరిగి తమ రోజువారి కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

'నులి'మేద్దాం!

(తరువాయి 5 పేజీ)

సూపర్‌వైజర్లకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ మాత్రలను ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలకు సరఫరా చేశారు.

మేడ్చల్ జిల్లాలో...

మేడ్చల్ జిల్లావ్యాప్తంగా 14 మండలాలు, జిల్లా కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్‌ల పరిధిలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. అంతేగాకుండా 793 అంగన్‌వాడీ కేంద్రాలు, 607 పాఠశాలలు, 152 కాలేజీలకు వెళ్లి అందజేస్తారు. జిల్లా వ్యాప్తంగా 1102 ప్రైవేటు స్కూళ్లలో మాత్రలను వేస్తారు. జిల్లా వ్యాప్తంగా 8,70,650 మంది చిన్నారులు, బాలలు ఉన్నట్లు గుర్తించారు. స్కూళ్లు, కాలేజీల నుంచి వైద్యశాఖ అధికారులు విద్యార్థుల జాబితా తెప్పించుకొని దానికి తగ్గట్టుగా మందులను అందుబాటులో ఉంచారు.

పిల్లలపై ప్రభావం..

నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారడం, తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు కలుగుతాయి. దీంతో పాటు శారీరక, మానసిక పెరుగుదల తగ్గిపోతుంది. ముఖ్యంగా విద్యార్థులో ఏకాగ్రత లోపిస్తుంది. అల్బెండజోల్ మాత్ర వేసుకోవడం ద్వారా వీటిని నిర్మూలించవచ్చు. రక్తహీనతను నియంత్రించడమే గాక వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే మాత్రలు వేయరు..

దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, ఇతర మందులు వాడుతున్న వారికి, ఫిట్స్ ఉన్నవారికి అల్బెండజోల్ మాత్రలను వేయవద్దని అధికారులు వైద్య సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. మిగతా వారిలో ఎవరికైనా మందులు వేసిన తర్వాత ఏమైనా దుష్ఫలితాలు కనిపిస్తే మండల వైద్యాధికారులను సంప్రదించాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం తిన్న తర్వాతే మాత్రలు వేయాలి. ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ కడుపుతో వేయకూడదు. మాత్రలు వేసుకున్న తర్వాత తాగేందుకు సురక్షితమైన నీటిని అందించాలి. వైద్యశాఖ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఈ మాత్రలు ఇస్తారు. 1-3 ఏళ్లలోపు చిన్నారులకు సగం మాత్రను చెంచాలో పొడి చేసి కొంచెం నీరు కలిపి తాగిస్తారు. 3-19 ఏళ్ల లోపు చిన్నారులు, కిశోర బాలలకు పూర్తి మాత్రను ఇచ్చి బాగా నమలమని చెబుతారు. 3 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకు పిల్లలకు పూర్తి మాత్ర మింగితే కొద్ది మందిలో గొంతులో ఇరుక్కోవడం జరుగుతుంది. దీంతో మాత్ర నమిలిమింగమని చెబుతారు. మాత్ర వేసిన తర్వాత అతికొద్ది మందిలో స్వల్ప దుష్ఫలితాలు కనిపిస్తాయని, దీనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. కొద్దిమందిలో వికారం, వాంతులు, విరేచనాలు అవుతాయని, ఇవి మరీ ఎక్కువగా ఉంటే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచిస్తున్నారు.

చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టం!

- యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జలవనరుల సంరక్షణపై ప్రభుత్వం దృష్టిసారించింది. చెరువుల ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చట్టాలులేకపోవడం, వాల్టా వంటి చట్టాలున్నా ప్రభావవంతంగా పని చేయకపోవడంతో జలవనరుల సంరక్షణ సవాలుగా మారుతోంది. చెరువు భూములను ఆక్రమిస్తే ఇప్పటికీ 1905నాటి భూ ఆక్రమిత చట్టం కిందే చర్యలు తీసుకునే పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చెరువుల సంరక్షణకు సమగ్రమైన ప్రత్యేక చట్టం తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. చెరువుల సంరక్షణకు బలమైన చట్టాన్ని తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కర్ణాటక, రాజస్థాన్‌లో చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. మనదగ్గర లేకపోవడంతో వేలాది ఎకరాల చెరువుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో 127 చెరువులు పాక్షికంగా, 44 చెరువులు పూర్తిగా కనుమరుగయ్యాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో చెరువుల్లోనే నివాస, వాణిజ్య భవనాలు నిర్మించిన దాఖలాలు ఉన్నాయి.

తెలంగాణలో 63,063 జలవనరులు (కుంటలు, చెరువులు, జలాశయాలు, చెక్‌డ్యామ్‌లు వంటివి) ఉన్నట్టు కేంద్ర జలశక్తి శాఖ తాజా సర్వేలో వెల్లడైంది. చెరువుల సంరక్షణకు వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ (వాల్టా) ఉంది. దీంతోపాటు తెలంగాణ మునిసిపల్ చట్టం కూడా చెరువుల సంరక్షణకు సంబంధించిన నిబంధనలు కలిగి ఉంది. అయితే ఈ చట్టాలు బలంగా లేకపోవడంతో ఆక్రమణలను అడ్డుకునే పరిస్థితి లేకుండాపోతోంది. హైదరాబాద్‌లోని కీలకమైన ప్రాంతాల్లో చెరువుల సంరక్షణ ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో 920 చెరువులు ఉంటే 2014 వరకు 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. 2014 నుంచి 2023వరకు మరో 44 చెరువులు పూర్తిగా కనుమరుగు కాగా 127 చెరువులను పాక్షికంగా ఆక్రమించారు. 2014 నుంచి 2023 వరకు 171 చెరువులు ఆక్రమించినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే చెరువుల ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు హైడ్రా అనే సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. చెరువుల పరిరక్షణకు గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, జలవనరుల పెంపునకు చర్యలు చేపట్టారు. ఇక ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 5వేలకుపైగా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పట్టణీకరణలో వేగం ఇందుకు ప్రధాన కారణంగా గుర్తించారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నివేదికల ప్రకారం హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో 2014 నాటికి 3,245 ఎకరాల చెరువుల భూములు ఆక్రమణలకు గురికాగా 2023నాటికి 4,000 ఎకరాలకు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20వేల ఎకరాలకు పైగా చెరువుల భూములు ఆక్రమణకు గురైనట్టు మిషన్ కాకతీయ పథకంలో చేపట్టిన సర్వేలో వెలుగుచూసినట్లు తెలుస్తోంది. మిషన్ కాకతీయతో గత ప్రభుత్వ హయాంలో 5వేల ఎకరాలను ఆక్రమణల చెర నుంచి విడిపించగా ఇంకా 15 వేల ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోనే ఉన్నాయి. చెరువుల సంరక్షణలో అనుకున్న ఫలితాలను పొందాలంటే బ్రిటిష్ కాలంనాటి భూ ఆక్రమిత చట్టంతో ఉపయోగంలేదని.. కర్ణాటక, రాజస్థాన్ తరహాలో బలమైన ప్రత్యేక చట్టాన్ని తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక 2016లో ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కూడా రద్దవడంతో జలవనరుల సంరక్షణకు పటిష్ఠ చట్టం తీసుకురావడంతోపాటు చెరువుల పర్యవేక్షణకు ఒక అథారిటీని ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది.

పొడిగింపా.. ప్రత్యేకాధికారులా?

- ఈనెల 15తో ముగియనున్న పీఏసీఎస్ పాలకవర్గాల కాలపరిమితి
- రేపు ఉత్తర్వులు వెలువడే అవకాశం!



మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితి ఈ నెల 15న ముగియనుంది. దీంతో సహకార సంఘాలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే మున్సిపల్, గ్రామపంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలో నడుస్తున్నాయి. ఈ నెల 15లోపు స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశముందనే ప్రచారం ఊపందుకుంది. ఈక్రమంలో ఈ నెల 15న సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితి ముగియనుండటంతో స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతనే సహకార సంఘాల ఎన్నికలు ఉండే అవకాశం ఉంటుంది. అప్పటివరకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాగా, సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితిని ప్రభుత్వం పొడిగిస్తుందా? లేక ప్రత్యేకాధికారులను నియమిస్తుందా? అనే విషయమై రేపు స్పష్టత వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 9 సహకార సంఘాలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 9 సహకార సంఘాలున్నాయి. మేడ్చల్, డబిల్‌పూర్, అల్వాల్, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట, బౌరంపేట, దూలపల్లి, పూడూరు సహకార సంఘాలున్నాయి. 9 సహకార సంఘాల్లో దాదాపు 30 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే అధికారుల కొరత ఉన్నందున 9 సహకార సంఘాలకూ ప్రత్యేకాధికారులను నియమించాలా? లేక రెండు, మూడు సహకార సంఘాలకు కలిపి ఒకరిని ప్రత్యేకాధికారిగా నియమించాలా? అనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సహకార సంఘాలు రైతులకు సంబంధించి ఆర్థిక లావాదేవీలతో పాటు ఎరువులు, విత్తనాలు వంటి కీలక సేవలు అందించాల్సి ఉంటుంది కాబట్టి.. ప్రభుత్వం ఆచితూచి నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

ఈ నెల 15న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితి ముగియనుంది. అయితే, ప్రస్తుత పాలకవర్గాల కాలపరిమితిని పొడిగిస్తారా? లేక ప్రత్యేకాధికారులను నియమిస్తారా? అనే విషయంపై ప్రభుత్వం ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మాకు కూడా ఎలాంటి ఆదేశాలు రాలేదు. రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముంది.

- వెంకట్‌రెడ్డి, డీసీవో

ఆరు నెలలు పొడిగించాలి

పీఏసీఎస్ పాలకవర్గాల కాలపరిమితిని 6 నెలల పాటు పొడిగించాలి. రుణమాఫీ, రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలందించడం, ఎరువులు, విత్తనాల సరఫరా వంటి విషయాల్లో అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రత్యేకాధికారులు అందుబాటులో ఉండకపోతే ఇబ్బందులు తలెత్తే అవకాశముంది.

రణదీప్‌రెడ్డి, మేడ్చల్ పీఏసీఎస్ చైర్మన్

ఢిల్లీలో బీజేపీ గెలుపు చరిత్రాత్మకం


తాండూరు: స్వీట్లు పంచిపెడుతున్న బీజేపీ శ్రేణులు

తాండూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం చరిత్రాత్మకమని బీజేపీ శ్రేణులు అన్నారు. పార్టీ తాండూరు నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఇందిరాచౌక్‌లో సంబురాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని శ్రేణులు తరలి వచ్చి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పూజారి పాండు, గాజుల శాంత్‌కుమార్, కృష్ణ ముదిరాజ్, బొప్పి సురేష్, చంద్రశేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, మాజీ కౌన్సిలర్ బాలప్ప, కందదనెల్లి సంగమేష్, అంతారం కిరణ్, ప్రహ్లాద్, రాజు, ప్రకాష్, అంజనేయులు ఉన్నారు.

పరిగి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ప్రధాని మోదీ అమలు చేస్తున్న పథకాలు, పాలనకు నిదర్శనమని పార్టీ పరిగి పట్టణ ప్రధాన కార్యదర్శి వార్ల ఆంజనేయులు అన్నారు. 26ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత బీజేపీ ఘన విజయం సాధించడం హర్షణీయమన్నారు. 12ఏళ్లు పాలించిన కేజ్రీవాల్ అవినీతి పాలనతో ప్రజలు విసుగుచెందారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

పూడూరు: ఢిల్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ పూడూరు మండల నాయకులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

కులకచర్ల: ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్యగౌడ్, సౌమ్యరెడ్డి, జానకిరాం, అంజిలయ్య, మైపాల్, చంద్రలింగం పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ఢిల్లీలో బీజేపీ ఘన విజయం పట్ల మోమిన్‌పేట్ మండల కేంద్రంలో శనివారం బీజేపీ అధ్యక్షుడు ఆశిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్ ముదిరాజ్, లక్ష్మారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కొడంగల్: బీజేపీ నాయకులు పూనం చంద్‌లాహోటీ, మోహన్‌రావు, చంద్రప్ప, టి.శేఖర్, మురళీధర్‌రెడ్డి తదితరులు టపాసులు పేల్చి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. ఢిల్లీలో బీజేపీ ఘన విజయం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

బొంరాస్‌పేట్: ఢిల్లీలో బీజేపీ ఘన విజయం పట్ల బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సీహెచ్ నర్సింహులు, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బాబయ్యనాయుడు, నాగురావు, ముకుంద, జగదీశ్‌సాగర్, జనార్దన్, శ్రావణ్‌గౌడ్, నరేశ్, సేవ్యనాయక్, మల్లేశం, శ్రీనివాస్‌సాగర్, పుట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంపై ఆ పార్టీ నాయకులు శనివారం సాయంత్రం ధారూరులో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేశ్, రవీందర్ గౌడ్, కె.అంజయ్య, కృష్ణ, జగదీశ్వర్, రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో బీజేపీ సంబురాలు

మేడ్చల్ టౌన్: ఢిల్లీలో బీజేపీ విజయం సాధించినందుకు శనివారం సాయంత్రం మేడ్చల్ పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున మేడ్చల్ పట్టణంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీజేపీశ్రేణులు పాల్గొన్నారు.

కీసర రూరల్: ఢిల్లీలో బీజేపీ గెలుపుతో నాగారం మున్సిపాలిటీ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం సాయంత్రం బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు నిర్వహించారు. నాగారం మున్సిపల్ మాజీ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి , నాయకులు నాగరాజు, వేణు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మోమిన్‌పేట్: సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు


బొంరాస్‌పేట్: సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు


ధారూరు: మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు


ఘట్‌కేసర్ రూరల్: నాగారం చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి గ్రామ పరిధిలో ఉన్న శివరాజ హరిహర దేవస్థానానికి ఎన్నికైన నూతన కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్ వంగ శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా నర్సింహులు, మహేశ్వరి, బాల్‌రాజ్, ఆలయ అర్చకులుగా సంతోష్‌శర్మలతో దేవదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్‌లు విచ్చేసి నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

మర్పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, జిల్లా నాయకులు రాములుయాదవ్, రమేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోట్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో నూతన సీసీ రోడ్డు పనులను నాయకులు డాక మహేశ్వర్‌రెడ్డి తదితరులు కలిసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు శశికాంత్, గ్రామ అధ్యక్షుడు నబీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో జాప్యం తగదు

నవాబుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులకు టెండర్‌లు ఇచ్చి ప్రొసిడింగ్ అయినా నేటి వరకు పనులు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముబారక్ పూర్-గుబ్బడి ఫతేపూర్ రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారన్నారు. పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యవసాయ రంగంలో పరిశోధనలు చేసి వ్యవసాయాన్ని బలోపేతం చేయాడానికి కృషి చేయాలని నల్ల నర్సింహారెడ్డి ఇంజనీరింగు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి తెలిపారు. కాచవానిసింగారం నిహాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం జరిగిన 'ఎన్‌టాక్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశం ఆర్థిక వృద్ధి చెందాలంటే వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో మరిన్ని పరిశోధనలు అవసరమని గుర్తుచేశారు. క్రిమిసంహారక మందుల వాడకం తగ్గించి, సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట వేసినప్పుడే ఆరోగ్యవంతమైన దేశంగా భారత్ నిలుస్తుందన్నారు. నిహాక్ స్కూల్‌లో విద్యార్థులు వ్యవసాయ రంగంపై చేసిన ప్రజెంటేషన్లు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిహాక్ స్కూల్ డైరెక్టర్ తీగుళ్ల సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ రూరల్: జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, సంపత్‌రెడ్డి

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

తాండూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మున్సిపల్ అభివృద్ధి పనులపై శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. పట్టణ అభివృద్ధికి కావాల్సిన పనులు, రోడ్ల వెడల్పు, మురుగునీటి కాల్వల అవసరమైనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై సమీక్షిచారు. పట్టణాభివృద్ధికి ఎన్ని నిధులు అవసరమవుతాయో అడిగి తెలుసుకున్నారు. ఎక్కడి నుంచి పనులు చేపట్టాలనే విషయమే మున్సిపల్ అధికారులు మ్యాప్ ద్వారా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి డిఈ మణిపాల్, ఏఈ ఖాజా, తదితరులు ఉన్నారు.


మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

దుద్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. మండలంలోని ఈర్లపల్లి గ్రామం నుంచి వాయిలగడ్డ తండా, ఈర్లపల్లి నుంచి గడ్డమీది తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం వారు శంకుస్థాపన చేశారు. అనంతరం చిలుముల్ మైలారం గ్రామంలో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెరుగు వెంకటయ్య, కృష్ణ, రవినాయక్, మొగులప్ప, పెంటప్ప, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజేశ్‌రెడ్డి

దైవచింతనతో మానసిక ప్రశాంతత


విరాళం అందజేస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు ఇప్పయిపల్లి వాస్తవ్యులు వడ్డె ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్యాట గడ్డలో నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నిర్మాణ పనులను శనివారం ఆయన పర్యవేక్షించి తన వంతుగా రూ.50వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు భీమ్‌రెడ్డి, దేశ్‌ముఖ్ ప్రేమ్ ప్రకాశ్‌రెడ్డి, సీహెచ్.చంద్రలింగం, గాదె మహిపాల్ ఆయనను ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర యువ నాయకుడు శ్రీమన్నారాయణ, ఆనందం, బాల్‌రెడ్డి, రఘు, యాదయ్య, చెన్నయ్య, బుచ్చయ్య, చందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్: పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 72వ వారం పూర్తయిన సందర్భంగా హిందూవాహిని సభ్యులు, యువకులు హనుమాన్ చాలీసాను పఠించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ అన్నారు. మండలంలోని బురాన్‌పూర్‌లో శనివారం గురుకుల పాఠశాల కోసం మంజూరైన రూ.22కోట్లతో పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భీమయ్యగౌడ్, బందెప్పగౌడ్, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలింగ్‌పై అవగాహన


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న ఎంఈవో

కులకచర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోలింగ్ నిర్వాహణపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. మండలంలోని ఇప్పయిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో శనివారం విద్యార్థులకు ఎన్నికల్లో ఓటు వేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్‌వో జైపాల్‌రెడ్డి, మండల సాంఘిక శాస్త్ర ఫోరం అధ్యక్షుడు వెంకటయ్య, కుసుమ సముద్రం పాఠశాల హెచ్‌ఎం పాండురంగయ్య, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, సరిత, రుక్మిణి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

చౌడాపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన లంబాడీల ఐక్యవేదిక జిల్లా ఇన్‌చార్జి విస్లావత్ రమేశ్‌నాయక్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లంబాడీల అభివృద్ధి కోసం సేవాలాల్ మహారాజ్ ఎంతో కృషిచేశారని కొనియాడారు.

ఆర్థిక సాయం

దోమ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లికి చెందిన కుమ్మరి రాములు అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బొంపల్లి కాంగ్రెస్ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సురేశ్, మాజీ ఎంపీటీసీ వెంకట్, నాయకులు బాల్‌రా జు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దోమ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగన్‌పల్లి, ఎల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో శనివారం ఎంఈవో వెంకట్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. బోర్డుపై రాయడం, చదవడం పరిశీలించారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం అనేది తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కీసర రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన జైని రవి(45) శుక్రవారం తన బైక్‌పై కుషాయిగూడ మార్కెట్‌కు వెళ్లి సరుకులు తీసుకొని తిరిగి వస్తుండగా చీర్యాల్ మెయిన్‌రోడ్డులో రాంగ్ రూట్‌లో వచ్చిన ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవి తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు, పోలీసులు చికిత్స నిమిత్తం కాచిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రవి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సుకింద పడి వ్యక్తి..

కోట్ పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి బస్సు కింద పడి మృతిచెందాడు. ఈ ఘటన కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిన్నారం గ్రామానికి చెందిన పరమటి బందయ్య(52) బందయ్య తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై జిన్నారం చౌరస్తా నుంచి జిన్నారం వైపు వస్తున్నాడు. అదే సమయంలో ఆర్టీసీ బస్సు వికారాబాద్ వైపు నుంచి కోట్‌పల్లికి వస్తుండగా బందయ్య బస్సు వెనక టైరుకింద పడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బందయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోట్‌పల్లి ఎస్ఐ గఫర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మరొకరు..

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం కిష్టాపూర్ రోడ్డులో ఓ సిమెంటు ఇటుకల తయారీలో పనిచేసే కన్నా(40) అనే కార్మికుడు గదిలో శనివారం మృతిచెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కన్నా మృతదేహంపై గాయాలున్నాయని, మరో కార్మికుడు మద్యం మత్తులో హత్యచేసి ఉండవచ్చుననే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేశారు. అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

- రూ. 11.75లక్షలు విలువ చేసే ఫోన్లు, సామగ్రి స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ల దొంగలను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేసి శనివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3వ తేదీన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నోజిగూడ అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి మొబైల్ దుకాణం షెట్టర్ పగులగొట్టి సెల్‌ఫోన్లు అపహరించుకెళ్లిన విషయం తెలిసిందే. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురి నిందితులను నారపల్లిలోని నందనవనం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన ప్రభాత్‌సింగ్, నేపాల్‌సింగ్, ప్రవీణ్‌సింగ్, తరుణ్‌పాల్ సింగ్‌లుగా గుర్తించారు. వీరు నగరంలోని బేగంబజార్‌లో ఉంటూ ఆటోడ్రైవింగ్ చేస్తుంటారు. తరుణ్‌పాల్‌సింగ్‌తో కలిసి జల్సాల కోసం డబ్బులు సంపాదించాలని దొంగతనాల బాటపట్టినట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో సెల్‌ఫోన్ల దుకాణాలను ఎంచుకొని షెట్టర్లు పగులగొట్టి సెల్‌ఫోన్లు దొంగతనాలు చేస్తుంటారు. నిందితుల వద్ద నుంచి 60 సెల్‌ఫోన్లు, ఒక టీవీ, సీసీటీవీ మానిటర్ 1, ఫోన్ల సామాగ్రి మొత్తం రూ. 11,75,533 విలువ చేసే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నాలుగురోజుల్లో సెల్‌ఫోన్ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులను, సిబ్బందిని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కోట్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కోట్‌పల్లి పోలీస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోత్కుపల్లి గ్రామానికి చెందిన బైండ్ల లక్ష్మయ్య(67) వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి కుమారుడు సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గఫర్ తెలిపారు.

సిలిండర్ లీకేజీతో మంటలు

- నలుగురికి గాయాలు

కులకచర్ల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరిగడ్డ తండాలో సిలిండర్ పైపు లీకేజీతో మంటలు చెలరేగి నలుగురికి గాయాలయ్యాయి. తండాకు చెందిన దేవమ్మ శనివారం ఉదయం ఇంట్లో వంట చేస్తుండగా సిలిండర్ పైపు లీకేజీతో మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నంలో ఆమెకు గాయాలయ్యాయి. బయట ఉన్న భర్త పాండు, పిల్లలు గణేశ్, సునిత ఇంట్లోకి వచ్చారు. వారు కూడా మంటలను ఆర్పే ప్రయత్నంలో గాయాలపాలయ్యారు. గమనించిన చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకొని నలుగురిని పాలమూర్ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆలయ భూమిని కాపాడాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూమిని కాపాడాలని మండలంలోని సిరిగిరిపేట్ గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన జీమస్ కుమార్ పదేళ్ల కిందట హైదరాబాద్ నుంచి హనుమాన్ విగ్రహం తెచ్చి ప్రతిష్ఠించేందుకు ప్రయత్నించాడు. అప్పట్లో గ్రామస్తులంతా కలిసి గ్రామంలో ఒక హనుమాన్ ఆలయం ఉండగా, మరో విగ్రహ ప్రతిష్ఠాపన ఎందుకని నచ్చజెప్పి విగ్రహ ప్రతిష్ఠాపనను నిలిపివేశారు. అయితే జీమస్ కుమార్ మృతి చెందగా అప్పట్లో ఉన్న ఆలయ అభివృద్ధి ఖర్చులు, నిత్య పూజల ఖర్చు నిమిత్తం జీమస్ కుమార్ భార్య సుమన్ వేసర్ అల్లాపూర్ శివారులో సర్వేనెంబర్ 58/అ లో 5 ఎకరాల 35గుంటల పట్టాభూమిలో 2ఎకరాల భూమిని గ్రామస్తుల సమక్షంలో తమ ఇష్టపూర్వకంగా ఆలయానికి ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. ప్రస్తుతం సుమన్ వేసర్ అన్నదమ్ములు కలిసి ఆమెను తప్పుదోవ పట్టిస్తూ ఆలయానికి ఇచ్చిన భూమిని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆలయానికి సూమన్ వేసర పేరున ఇచ్చిన రెండెకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయరాదని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అంబ్రేష్, బిచ్చిరెడ్డి, శేఖర్, కిష్టప్ప, భద్రు, కిష్టయ్య, ఎంకటయ్య, నర్సింహులు, ఆశన్న, వీరన్న, హన్మంతు, మల్లికార్జున్, సగరప్ప, శ్రీనివాస్ ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

(5వ పేజీ తరువాయి)

కృషి చేద్దామన్నారు. అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందనేది ఢిల్లీకి చెప్పే అవకాశం మీకుందని ఆయన వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులనుద్దేశించి అన్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలని, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్ అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో గెలవాలని, బీఆర్ఎస్ అభ్యర్థి జడ్పీ చైర్మన్ అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి, స్పీకర్‌కు చెక్ పెట్టినట్లవుతుందని చెప్పారు. గెలుపు గుర్రాలు, సామాజిక సమీకరణాలతో మనకే అన్నీ తెలుసు అనుకోవద్దని, అన్నీ విశ్లేషించి అభ్యర్థులను ఎంపిక చేద్దామని సూచించారు. ఎవరు ఇంటివారో.. ఎవరు బయటివారో తేలిపోయిందని, పార్టీ కూడా సబ్బు పెట్టి కడిగినట్లయిందని, కొట్లాడేవారు.. నిఖార్సైన పార్టీ నాయకులే మిగిలారన్నారు. వికారాబాద్ జిల్లా కావాలనేది చాలా కాలంగా డిమాండ్ ఉండేదని, తామే సాకారం చేశామని, హైదరాబాద్ పక్కనే ఉన్నా.. డిగ్రీ కాలేజీ లేకపోతే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌తో పాటు మెడికల్ కాలేజ్ ఇచ్చామని, అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాల్సి ఉండాల్సిందన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి ఆపడం వల్లనే ఆలస్యమైందని, 90 శాతం పనులు పూర్తయ్యాయని కేటీఆర్ తెలిపారు. రిజర్వాయర్లు, పంప్ హౌస్‌ల నిర్మాణం పూర్తయిందని, వికారాబాద్ వరకు పాలమూరు నీటిని తీసుకువచ్చే విషయంలో ఆలస్యం జరిగిందని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే పాలమూరు నీళ్లు వస్తాయనేది ప్రజలకు వివరించాలని సూచించారు. వికారాబాద్ ప్రజలు మంచోళ్లని, ఇమాన్‌దారులని, మనమే కొన్ని కొన్ని చిన్న తప్పుల వల్ల ఓడిపోయామని గుర్తుచేశారు. దూరమైన వారిని దగ్గరకు తీసుకోవాలని, అలిగిన వారితో మాట్లాడాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌కు సూచించారు. అయితే, ఆనంద్ మీద చిన్న చిన్న కోపాలు, తాపాలు ఉంటే తీసేయాలని, వర్గపోరు, అనవసర పోరుకు పోవద్దని, అనవసర పంచాయితీలు వద్దని పార్టీ శ్రేణులకు హితవు పలికారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల గుండె నిండుగా ఉందని, అధికారం మాత్రమే పోయింది తప్ప.. అభిమానం కాదని, ముమ్మాటికీ ప్రజలు బీఆర్ఎస్ తోనే ఉన్నారని కేటీఆర్ ఈ సందర్భంగా వారిలో మనోధైర్యం నింపారు. సమావేశంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, టీఎస్‌డబ్ల్యుఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జడ్పీ మాజీ చైర్మన్ విజయకుమార్, నాయకులు విజయకుమార్, ఎం.రాంచందర్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.